


12న జిల్లాకు చంద్రబాబు రాక

ఇరగవరం నుంచి తణుకు వరకూ పాదయాత్ర

వైజంక్షన్‌లో బహిరంగ సభ



ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల 12న తేతలి వైజంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటున్నారు. రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తొలుత చంద్రబాబు ఇరగవరం మండలం నుంచి తణుకు వై.జంక్షన్ వరకు పాదయాత్ర చేయనున్నారని తెలిపారు. ఈ పాదయాత్ర సుమారు 12 కిలోమీటర్లు సాగుతుందని, అనంతరం సభలో పాల్గొంటారని చెప్పారు.

అన్నదాత ఆక్రందన..!

- ఇంకా వీడని ధాన్యం కొనుగోలు సమస్యలు
- కైకరంలో సంచుల కోసం రైతులు పడిగాపులు
- లారీలు కావాలంటే ముందుగా సొమ్ము చెల్లించాల్సిందే
- అధికారుల ప్రణాళికా లోపంతో రైతులకు కష్టాలు
- 25 రోజులైనా అపరిష్కృతంగానే సమస్యలు



కైకరం ఆర్‌బికెలో సంచుల కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలు సమస్యలు ఇప్పటికీ కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ అన్నదాతల అవస్థలు మిన్నంటుతూనే ఉన్నాయి. సంచుల కోసం రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతూనే ఉన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించి 25 రోజులు దాటినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. ధాన్యం కొనుగోలులో ప్రణాళికాలోపంతో రైతులకు ప్రభుత్వం ఎనలేని కష్టాలు సృష్టించింది. రైతులు వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా రబీలో 79 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాల్లోనే అత్యధికంగా వరి సాగు జరిగింది. 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా అధికారులు విఫలమయ్యారు. సంచులు, లారీల కోసం ఇప్పటికీ రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ధాన్యం కొనుగోలు టార్గెట్ తక్కువగా నిర్ణయించి సంచులు ఇవ్వకుండా రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. సంచుల నుంచి ధాన్యం కొనుగోలు టార్గెట్ల వరకూ రైతుల నుంచి ఒత్తిడి వచ్చే వరకూ ఎటువంటి నిర్ణయాలూ తీసుకోకుండా కాలయాపన సాగించారు. దీంతో అనేక ఇబ్బందులు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 9.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసి 6.45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రణాళికలు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

సంచుల కోసం పడిగాపులే..

ధాన్యం కొనుగోలు ప్రారంభించి 25 రోజులు దాటినా రైతులను ఇప్పటికీ సంచుల కొరత వేధిస్తూనే ఉంది. సంచుల కోసం కైకరం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులు పడిగాపులు పడ్డారు. ఎట్టకేలకు కొంతమందికి సంచులివ్వగా, ఇంకా 50 వేలకు పైగా సంచులు అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. సంచులు తీసుకెళ్లిన రైతులు ధాన్యం పట్టినా లారీలు మాత్రం రావడం లేదు. లారీ కావాలంటే ముందుగా కిరాయి నిమిత్తం రూ.18 వేలకు పైగా చెల్లించాలని చెబుతున్నారు. ఇప్పటికే వర్షాలతో నానా ఇబ్బందులు పడ్డ రైతులు ఇక కష్టాలు భరించలేక లారీలకు ముందస్తుగా సొమ్ము చెల్లించి ధాన్యం తరలిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని రైతుభరోసా కేంద్రాల్లో టార్గెట్ పూర్తయిందంటూ సంచులు ఇవ్వని పరిస్థితి ఉంది. అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేని పరిస్థితి నెలకొంది. చివరి బస్తా కొనుగోలు చేసేవరకూ ఈ కష్టాలు వీడవా అంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులో రైతులు పడ్డ కష్టాలు చూసి అంతా తీవ్ర ఆవేదనకు గురైనా ప్రభుత్వం నుంచి పెద్దగా చలనం లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. గడిచిన ఖరీఫ్‌లోనూ ఇవే కష్టాలు పునరావృతమైనప్పటికీ రబీలో సమస్యలు లేకుండా ప్రణాళికలు రూపొందించడంలో తీవ్రలోపం కన్పించింది. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరు మారకపోతే రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

ఉద్యోగాలివ్వరు. భృతి అయినా ఇవ్వండి


డివైఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి, లేకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పట్టణ కార్యదర్శి ఎస్.కె.మాబుసుభాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశవైఖరి వీడాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బిజెపి ఎనిమిదేళ్లుగా విఫలమైందన్నారు. ఇప్పటి వరకూ నిరుద్యోగుల సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థల్లో వివిధ శాఖల్లో కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు విడుదల చేస్తానన్న నరేంద్ర మోడీ, దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తొలగించి లక్షలాది మంది యువతను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన సిఎం జగన్ మాటతప్పి మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి, గ్రూప్-1, 2, గిరిజన డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. సచివాలయ వాలంటీర్లను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ప్రతినెలా రూ.ఐదు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేష్, ఉదయ్, పి.వెంకట సుబ్బారావు, మంగరాజు, ఎం.పవన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డివైఇఒ

విద్యార్థుల ఫెయిల్‌పై ఆగ్రహం

ప్రజాశక్తి - ముసునూరు

గుడిపాడు హైస్కూల్ విద్యార్థులు ఎక్కువ మంది గణిత పరీక్షలో ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ గణిత టీచర్ లేకపోవడంతో 21 మందికి ఏడుగురు మాత్రమే పాసు మార్కులతో గట్టెక్కారని, మిగిలిన 14 మంది ఫెయిల్ అయ్యారన్నారు. ఏడాది నుంచి గణిత టీచర్ పోస్టు ఖాళీగా ఉందని దీనివల్లే తమ పిల్లలు ఫెయిల్ అయ్యారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నూజివీడు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శేవ్య ఘటనా స్థలానికి చెరుకుని విద్యార్థులతో, తల్లిదండ్రులతోమాట్లాడారు. విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, టిడిపి ఉపాధ్యక్షులు కొల్లి గంగారామ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేయకుండా డబ్బులు కాజేశారు

'రామచంద్ర' నిర్వాకంపై కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ ఫిర్యాదు

విచారణ చేపట్టిన అధికారులు

ఆసుపత్రికి నోటీసులు జారీచేస్తామని హామీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తనకు కంటి వైద్యం చేయకుండా చేసినట్లు తప్పుడు వీడియో సృష్టించి జంగారెడ్డిగూడెంలోని రామచంద్ర కంటి ఆసుపత్రి వైద్యులు ఆరోగ్యశ్రీలో రూ.18 వేలు డ్రా చేశారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ విమర్శించారు. దీనిపై ఆరోగ్యశ్రీ రీజనల్ డైరెక్టర్ ఆండ్రూస్ విచారణ జరిపి ఆసుపత్రికి నోటీసులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జంగారెడ్డిగూడెంలోని రామచంద్ర కంటి ఆస్పత్రిలో తన కంటికి చికిత్స చేయకుండా తన ఫొటో అప్‌లోడ్ చేసి ఆసుపత్రి వైద్యులు ఆరోగ్యశ్రీలో రూ.18 వేలు డ్రా చేసినట్లు గుర్తించి స్పందనలో ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై స్పందించిన అధికారులు ఆరోగ్యశ్రీ రీజనల్ డైరెక్టర్ మంగళవారం విచారణ జరిపారని, విచారణకు కంటి వైద్యులు హాజరుకాకుండా సిబ్బందిని పంపించారని ఆయన తెలిపారు. అయితే దీనిపై విచారణ జరిపిన రీజనల్ డైరెక్టర్ ఆసుపత్రికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చాలా జరుగుతున్నాయని, అధికారులు స్పందించి ఆరోగ్యశ్రీ సొమ్ము వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

'ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్' వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళల భద్రత, సాధికారత లక్ష్యంగా జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ఏలూరు నగరంలో 'ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్' ప్రత్యేక కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ వాహనాన్ని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఏలూరు నగరానికి వచ్చి రాత్రి సమయంలో మహిళలు ప్రయాణానికి ఇబ్బంది పడకుండా ఈ వాహనంలో సురక్షితంగా వారి ఇంటివద్దకు చేర్చేందుకు ప్రత్యేకంగా వాహనంలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో ఒంటరి మహిళలు రాత్రి సమయాల్లో ప్రయాణ సౌకర్యం లేక ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము ఐదు గంటల మధ్య ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్‌పి తెలిపారు. ఎవరైనా దూరప్రాంతాల నుంచి వస్తూ ఏలూరు నగరంలో రాత్రి వేళ గమ్యస్థానానికి చేరేందుకు ఎలాంటి రవాణా సౌకర్యం లేకుంటే పోలీస్ కంట్రోల్ రూమ్ 100, 112, 83329 59175 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న బిజెపి

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు సహించరానివని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని భాస్కరరావుపేట, గుర్వాయిపాలెం, కలిదిండి, పడమటిపాలెం, ఎస్ఆర్‌పి అగ్రహారం, సానా రుద్రవరం గ్రామాల్లో ఉపాధి హామీ రక్షణ యాత్ర సాగింది. ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. రెండు పూటలా ఉపాధి పనుల వల్ల పనిదినాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. 200 రోజుల పని, రూ.600 రోజు వేతనంతో పాటు పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన ఏలూరు కలెక్టరెట్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేష్, చిన్నం మాధవ, వీరవల్లి భాస్కరరావు, కార్యకర్తలు వీరరాఘవులు, వెంకటేశ్వరరావు, బొడ్డు సురేష్, బుస్సా రామ నాగేంద్రం పాల్గొన్నారు.

నేడు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల పదో తేదీన స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్ట రక్షణకు మండలంలోని లక్కవరం, దేవులపల్లి, శ్రీనివాసపురం, పట్టిసపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాల్లో పర్యటించారు. అనంతరం కూలీలతో జీవరత్నం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమైందన్నారు. ఈ చట్టానికి బడ్జెట్‌లో నిధులు భారీగా తగ్గించారని తెలిపారు. పేదల ఉపాధికి కేటాయించాల్సిన నిధులు అంబానీ, అదానీలకు పన్ను రాయితీల రూపంలో ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో విధానం రద్దు చేయాలని, పాతపద్ధతిలో పే స్లిప్పులు, వేసవి అలవెన్సులు, సైట్ సూపర్‌వైజర్లకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఐదు రోజులపాటు ప్రచార యాత్రలు నిర్వహించామని, వంద గ్రామాలు తిరిగి ఉపాధి కూలీలను కలిశామన్నారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి, నిట్టా నాగరాజు పాల్గొన్నారు.



కలిదిండిలో..

ముదినేపల్లి : ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో మండలంలోని వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. పని ప్రదేశాల వద్దకు యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ములకలపల్లి, వణుదుర్రు, అల్లూరు, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి వ్యవసాయ కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు, జిల్లా కమిటీ సభ్యులు జె.మహేష్, సిహెచ్.మాధవ, మండల నాయకులు దాకారపు నాగేశ్వరరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..



ముదినేపల్లిలో..

ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలని ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు రూరల్



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచి, సరిపడా గోనె సంచులు ఇవ్వాలంటూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మల్కాపురం ధాన్యం కల్లాల్లో మండుటెండలో కౌలు రైతులు నిరసన వ్యక్తంచేశారు. మల్కాపురం ఆర్‌బికె పరిధిలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌బికెల పరిధిలో నిర్ణయించిన ధాన్యం కొనుగోలు టార్గెట్లు పూర్తికావడంతో గోనె సంచులు ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎక్కడైతే లక్ష్యం పూర్తయిందో అన్నిచోట్లా టార్గెట్లు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. మల్కాపురం ఆర్‌బికె పరిధిలో 2056 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి కావడంతో రైతులకు గోనె సంచులు ఇవ్వడం లేదన్నారు. ఈ ఆర్‌బికె పరిధిలో మరో వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్, ఎన్.వెంకటేశ్వర్లు, చింతాడ గోపాలం, నాగులపల్లి బిక్షువులు పాల్గొన్నారు.

సమయ పాలన తప్పనిసరి : ఎంపిపి


ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు సమయపాలన పాటించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మంగళవారం మండల పరిషత్ సమావేశపు హాలులో కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు నిర్ణీత సమయానికి కార్యాలయాలకు చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమయానికి హాజరు వేయాలని, ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు కేటాయించిన యూనిఫారం తప్పక ధరించాలని చెప్పారు. ఎంపిడిఒ పి.మల్లీశ్వరి మాట్లాడుతూ కార్యదర్శులందరు సమన్వయంతో పని చేసి మండలాన్ని జిల్లాలో ముందు వరసలో నిలపాలన్నారు. అనంతరం జగనన్నకు చెబుదాం లైవ్‌టెలికాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ కారక్రమంలో తహాశీల్దార్ కె.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి టివి.సారధి పాల్గొన్నారు.

పంట కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : టిడిపి

ప్రజాశక్తి - భీమడోలు

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ టిడిపి నేతలు భీమడోలు తహాశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా కార్యాలయం ఎదుట బైఠాయించారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల వరితో పాటు ఉద్యానవన పంటలు, పండ్ల తోటలు, ఇతర పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహాశీల్దార్ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు, డి.పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.



భీమడోలులో..

టి.నరసాపురం : పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో తహాశీల్దార్ జెవి.సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ఆహార, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామ్మూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట సూర్యనారాయణ, సందేపూడి సాయి పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి తహాశీల్దార్ కృష్ణ జ్యోతికి జిల్లా పార్లమెంటరీ రైతు అధ్యక్షులు గుత్తా వెంకటే శ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిం చాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి చింతలపూడి టౌన్ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, రైతు నాయకులు, మాజీ మండల ప్రెసిడెంట్ ఆది జగన్, సీనియర్ నాయకులు రాజారెడ్డి, రైతు నాయకులు చేకూరి అంకమరావు, తెలుగు యువత టౌన్ అధ్యక్షులు నత్త రవికుమార్, బిసి నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరు : నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని, గోనె సంచులు ఇవ్వాలని కోరుతూ టిడిపి నేతలు తహాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా యువత అధ్యక్షులు రెడ్డి సూర్యచం ద్రరావు, మండల అధ్యక్ష కార్యదర్శి పాతూరి విజయ్, నల్ల ఆనంద్, కడియాల రవిశంకర్, మారిశెట్టి ప్రసాద్, నారాయణ పురం సర్పంచి దిడ్ల అలకనంద శ్రీనివాస్, యాళ్ల సుజీవరావు, ఇమ్మని గంగాధర్, బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.



టి.నరసాపురంలో..

పోలవరం : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కుంచే దొరబాబు డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహాశీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పిడుగుపాటుకు మృతి చెందిన కుటుంబాలకు పరిహారాలు చెల్లించాలని కోరారు.

మత్తు పదార్థాల నిరోధానికి చర్యలు : ఎస్‌పి


మాట్లాడుతున్న ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మత్తు పదార్థాల బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిని మత్తు పదార్థాల నుంచి దూరం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని, రవాణాదారులపై ఉక్కు పాదం మోపుతామని ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కొటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి రవాణా, సరఫరా మీద మాత్రమే కాకుండా మత్తును కలిగించే ఉత్ప్రేరకాలు సమాజానికి ప్రమాదకరంగా మారాయని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసి వీటిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యాసంస్థలు, మాల్స్, గోడలపై టోల్ ఫ్రీ నెంబర్ 14500ను ప్రదర్శించాలని, ప్రజలను చైతన్యవంతులను చేయటం ద్వారా మార్పు తీసుకురావాలని ఎస్‌పి కోరారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉన్నా విక్రయించినా, సేవించినా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు మత్తు పదార్థాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సుందరయ్య కాలనీలో ముగ్గుల పోటీలు


ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సుందరయ్య వర్థంతి సందర్భంగా మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని ఐద్వా మండల కార్యదర్శి నేలటూరి నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మండల కేంద్రంలోని ప్రతి మహిళ ముగ్గుల పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని నిర్మల పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సుందరయ్య కాలనీ ఏర్పడి 15 ఏళ్ల సందర్భంగా వార్షికోత్సవం చేస్తున్నట్లు ఎన్‌వి అప్పారావు తెలిపారు.

గిట్టుబాటు ధర కోరుతూ వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు నూజివీడు తహశీల్దార్ ఎల్లారావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రూ.1,960 ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యనమదల సత్యనారాయణ(నాని), ముసునూరు రాజా, వెంకటరెడ్డి, వీరమాచినేని సత్యనారాయణ పాల్గొన్నారు.


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాయిబాబా, ప్రసాద్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్తపట్టిసం గ్రామ సొసైటీ ద్వారా ఎపి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కొత్త పట్టిసం సొసైటీ అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబాతో కలిసి ఎపి మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రసాద్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ తేమ, ఇతర వ్యర్థ పదార్థాల శాతం, ఇతర ధాన్య గింజలు, కల్తీ గింజలు, దెబ్బతిన్న గింజల శాతం, పాక్షికంగా దెబ్బతిన్న, రంగు మారిన, విరిగిన గింజల శాతం, ముతక పూర్తిగా తయారు కాని గింజల శాతం, పురుగు పట్టిన గింజల శాతం వంటివి పరిగణలోకి తీసుకుని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మొక్కజొన్న కనీసం మద్దతు ధర రూ.1962గా ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. రైతుల వద్ద నుంచి ఆర్‌బికె ద్వారా మద్దతు ధరపై మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొక్కజొన్న కొనుగోలు చేసిన పది రోజుల్లోపే రైతు బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, రంభ వెంకన్నబాబు, వీరపరాజు వెంకన్నబాబు, మజ్జి వేణు, సూర్రెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించేలా జగన్ పాలన'

ప్రజాశక్తి - పోలవరం

ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు పరిష్కారం లభించే దిశగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. జగనన్నకు చెబుదాం పేరుతో ప్రజా సమస్యల పరిష్కారానికి సిఎం జగన్ మంగళవారం శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. జగనన్నకు చెబుదాం ప్రత్యక్ష ప్రసారాన్ని మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.శ్రీని వాస్‌బాబు, ఇన్‌ఛార్జి ఎంఇఒ స్వరూప్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ వెంకటరమణ, హౌసింగ్ ఎఇ రమణరావు, ఎస్‌ఐబి సిఐ శ్రీనివాస్ బాలాజీ, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుశరన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, విఆర్‌ఒలు జన్నీఫర్, ఆకాష్ ఉన్నారు.

ముసునూరు :జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరమవుతాయని ముసునూరు వైస్ ఎంపిపి కోటిగిరి రాజానాయన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యం లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజానాయన, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రి నెంబర్ ఏర్పా టు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి-2 గంగధరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నూకల లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


బోల్తా పడిన లారీ

మండలంలోని రమనక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం వరంగల్ జిల్లా నుంచి కాకినాడకు నూకల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సివిల్ సప్లై అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని నూకలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించారు.

పర్యావరణానికి పెనుముప్పుగా పాలిథిన్

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోని అధికారులు




ప్రజాశక్తి - మండవల్లి

పాలిథిన్ పర్యావరణానికి పెనుముప్పుగా మారింది. ప్రకృతి ఒడిలోని జీవరాసుల పెరుగుదలను, మనుగడను శాసిస్తుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే విధంగా చైతన్యం తీసుకురావడంలో అధికారులు విఫలమవ్వడంతో దాని వినియోగం మరింత పెరిగింది. ప్లాస్టిక్ అణువులు తాగునీటి వనరులతో కలిసిపోవడంతో వాటిని సేవించిన ప్రజలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. మనిషికి మట్టికి మధ్య ప్లాస్టిక్ అడ్డుగోడలా మారి భవిష్యత్తు తరాల మనుగడను అంధకారంలోకి నెట్టేస్తుంది.

మండవల్లి మండలంలో పాలిథిన్ వినియోగం భారీ స్థాయిలో కొనసాగుతుంది. ఏం కొనాలన్నా, తినాలన్నా, ఏది పట్టుకు వెళ్లాలన్నా ప్లాస్టిక్ లేనిదే పని సాగని పరిస్థితి నెలకొంది. ప్లాస్టిక్‌తో మానవాళికి పొంచి ఉన్న ప్రమాదంపై అప్పటి కృష్ణాజిల్లా కలెక్టర్ ఇంతియాజ్ కృష్ణాజిల్లాని ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నేను సైతం కృష్ణమ్మ శుద్ధిలో కార్యక్రమాన్ని చేపట్టి ప్లాస్టిక్ ఏరువేతకు 2019లోనే చర్యలు చేపట్టారు. కోవిడ్ అనంతరం 2022లో రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం మోపి పాలిథిన్ వినియోగాన్ని నియంత్రించే విధంగా చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రజలను భాగస్వామ్యం చేసి ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రచారానికే పరిమితమైన అధికారులు నియంత్రణను గాలికి వదిలేయడంతో మండవల్లి మండలంలో ప్లాస్టిక్ వినియోగానికి హద్దు అదుపు లేకుండా పోయింది. అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యంతో ప్లాస్టిక్‌ను నియంత్రించడంలో ఆశించినంత దిశగా అడుగు ముందుకు పడలేదు. తోపుడు బండ్ల దగ్గర నుంచి హోటళ్ళు, మాంసం దుకాణాలు, కిరాణా షాపుల్లో పాలిథిన్‌ను విపరీతంగా వినియోగిస్తున్నారు. దీంతో రహదారుల వెంబడి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోయాయి. నీటి ప్రవాహానికి అడ్డుపడుతుంది. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వాటి అణువులు నీటిలో కలిసిపోవడంతో ఆ నీటిని సేవించిన జంతువులతో పాటు జలచరరాశులు వాటి మనుగడను కోల్పోతున్నాయి. ఆ జంతువుల మాంసాన్ని, చేపలను తిన్న ప్రజలు అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకుని వ్యాధుల బారిన పడకుండా భవిష్యత్ తరాలను కాపాడాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరిని వివరణ కోరగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. మండవల్లిని ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ప్లాస్టిక్ ఎంతో ప్రమాదం
ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్



సమస్త జీవరాసుల మనుగడకు ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరం. అవగాహన పెంచుకుని నివారించకపోతే పెద్ద విధ్వంసాన్ని చవిచూడాల్సి వస్తుంది. ప్రతిరోజు పీల్చేగాలి, తినే పదార్థాలు, తాగే నీటి ద్వారా ప్లాస్టిక్ అణువులు మానవ శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. అంతేకాకుండా ప్లాస్టిక్ ఉత్పత్తులపై ఉండే రసాయనలు తీవ్రమైన హార్మోన్ సంబంధిత క్యాన్సర్‌ను, అంధత్వాన్ని, నాడీ వ్యవస్థ లోపాలతో పాటు మతిమరుపును కలుగజేస్తుంది. రోడ్లపై పక్కన పడవేస్తున్న ప్లాస్టిక్‌ను తిన్న పశువులు అవి కడుపులో జీర్ణం కాక మృత్యువాత పడుతున్న సంఘటనలూ ఉన్నాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోకుండా విచ్చలవిడిగా వినియోగిస్తూ వాటిని ఎక్కడబడితే అక్కడ కాల్చేయడంతో వాతావరణంలో కాలుష్యం ఏర్పడి ప్రకృ వనరులు కూడా పాడైపోతున్నాయి. ప్లాస్టిక్ భూతం నుంచి భావితరాలను రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలేసినప్పుడే అది సాధ్యమవుతుంది.

'బడిబాట' విజయవంతానికి పిలుపు

భీమడోలు : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమడోలు విద్యాధికారి డి.సాంబశివరావు కోరారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో బడిబాట కార్యక్రమంపై మండల విద్యాధికారి సాంబశివరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బడి ఈడు గల పిల్లలందరూ పాఠశాలలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే క్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి వివరాలను నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ వారి వారి పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో వారందరూ తిరిగి సప్లమెంటరీ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించి తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించే విధంగా సహకరించాలని కోరారు. జగనన్న విద్యా కానుక పుస్తకాలు, సామగ్రి జూన్ మొదటి వారంలో పాఠశాలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రక్తహీనత నివారణ కోసం పంపిణీ చేసిన ఐరన్ మాత్రలను విద్యార్థులు వినియోగించుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఎంఆర్‌పిలు సత్యప్రసాద్, రమణ పాల్గొన్నారు.


మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - మండవల్లి

శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేవిధంగా సంపాద కేంద్రాలను అందుబాటులోకి తీసుకరావాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి రాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలో ఏర్పడిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి లబ్ధిదారులు నివాసం ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులంతా సహకరించాలన్నారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలపై చేయదగిన పనులపై సమీక్షించారు. అనంతరం మండవల్లి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఉన్న పి.మల్లేశ్వరి కలిదిండి అదనపు బాధ్యతలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆది విష్ణు, జెడ్‌పిటిసి సభ్యులు ముందర విజయనిర్మల, తహశీల్దార్ సతీష్, ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తేనే విజయాలు

ప్రజాశక్తి - మండవల్లి


విద్యార్థిని, తల్లిదండ్రులను సత్కరిస్తున్న సిబ్బంది

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ప్రథమ స్థానాలు వాటంతట అవే కైవసం అవుతాయని యువసాయి ప్రదీప్ రుజువు చేశాడని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన యువసాయి ప్రదీప్ పదో తరగతి పరీక్షల్లో 585 అత్యధిక మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం సాధించాడు. యువసాయిప్రదీప్‌కు మంగళవారం నిర్వహించిన అభినం దన సభలో ఎంపిపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో కష్టపడి చదివి చదివినది జ్ఞాపకం పెట్టుకుని పరీక్షలు రాయబట్టే మండల ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. మరిన్ని ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురా వాలని ఆయన కోరారు. అనంతరం 545 మార్కులు సాధించి పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచిన గొర్రెపర్తి కుసుమను, 528 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన గంగుల జగదీష్‌ను, 524 మార్కులు సాధించిన గంగునేని నాగ సాయిని, 519 మార్కులు సాధించిన గంగుల లిఖిత్ శివమణిని, 501 మార్కులు సాధించిన ముచ్చర్ల జయశ్రీని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పుర ప్రముఖులు విద్యా కమిటీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, రైతు సంఘం నాయకులు చేబోయిన వీర్రాజు, సొసైటీ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, సుధామ ఫౌండేషన్ అధినేత విజయ్ కుమార్, ముళ్లపూడి సత్తిబాబు, మెండ సురేష్, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి, గురజ గ్రేడ్-3 శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు మంగళవారంతో రెండోరోజుకు చేరాయి. ఈ శిబిరాల్లో విద్యార్థు లకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు, ఉపాధ్యాయులతో వివిధ సబ్జెక్టుల్లో అవగాహన కల్పించారు. విజ్ఞాన్ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ దయానంద్, గౌతమ్ స్కూల్ మాస్టార్ జి.వెంకటేశ్వరరావు పిల్లలకు క్లాస్‌లు చెప్పారు. జూన్ 11వ తేదీ వరకు నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగిం చుకోవాలని ముదినేపల్లి గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవి కోరారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో కథలు, పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి సంఘం అధ్యక్షులు రాజారామ్మోహన్ రావు పాల్గొని పలు నైతిక విలువల గురించి వివరించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులచే వస్త్రాల వితరణ

నూజివీడు రూరల్ : మండలంలోని తుక్కులూరు, రామన్నగూడెం గ్రామాల్లో యానాదుల కాలనీల్లోవారికి మంగళవారం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నూతన వస్త్రాలు వితరణగా అందించారు. డెస్టినీ ఛెంజెస్ సంస్థ ఆధ్వర్యంలో 160 కుటుంబాలకు రెండు వేల జతల నూతన వస్త్రాలను వితరణగా అందించారు. కళాశాల డీన్ వెంకట్రావు, స్రవంతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహనతో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ బంగారు భవిష్యత్తు లభించాలని ఆకాంక్షించారు.

'స్పందన'లో ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి


చేలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం మత్స్యశాఖ అధికారులు గురజ వెళ్లి చేలను పరిశీలించి స్థానికుల ను విచారించారు. ఈ నెల రెండో తేదీన కైకలూరులోని సిఎన్ ఆర్ గార్డెన్‌లో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో మండలంలోని గురజ మఠం వద్ద ఉన్న నివాసితులు తమ ఇళ్లను ఆనుకుని బడాబాబులు చెరువుల తవ్వకాలకు ప్రయత్నాలు చేస్తున్నారని, చెరువులు తవ్వితే తాము అనేక సమస్యలు పడాల్సి వస్తోందటూ, అనుమతులు ఇవ్వొద్దంటూ ఆరట్ల శివనాగరాజు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఫిర్యాదుపై మండల మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి వి.సతీష్‌కుమార్, గురజ గ్రామ మత్స్యశాఖ సహాయకురాలు వినూత్న, ఫిర్యాదుదారుడు శివనాగరాజుతో కలిసి చేలను పరిశీలించారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆక్వా చెరువులు తవ్వేందుకు ఎవరికి ఈ ప్రాంతంలో అను మతులు ఇవ్వలేదన్నారు. ఎవరైన చెరువుల తవ్వకాలు చేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. తాము వచ్చి తవ్వకాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మామిడి తోటల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బత్తులవారిగూడెంలో మామిడి తోటలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.50 వేల నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాతి మంగు, మసి మంగు వల్ల మామిడి రైతులు కుదేలయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముసునూరు రాజా, జగ్గవరపు వెంకటరెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 280/2022

Plaintiff: State Bank of India, Main Branch, Tadepalligudem
Defendant: Bommanaboina Srinivasarao
To:
Bommanaboina Srinivasarao, S/o. Nageswararao, Door No. 3-34, Ramachandrapuram Village, Near Korukollu, Mudinepalli Mandalam, Mudinepalli JCJC.

పై నెంబరు దావాలో ప్రతివాది ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను సదరు దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా evade చేయుచున్నందున substituted service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు యిచ్చి **ది. 16-05-2023 కి వాయిదా వేసియున్నారు.** కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టులో హాజర్రై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

PASUPULETI SRINIVAS
Tadepalligudem Advocate for Plaintiff
Date:06-05-2023 Tadepalligudem

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 156/2023, I.A. 542/2019 in O.S. No. 24/2014

Between:
బుర్రా పూర్ణిమ **-పిటీషనరు**
Vs
రాట్నాల శ్రీనివాసరావు వగైరా **-రెస్పాండెంట్లు**
To:
R-9: మెరగాని హితైషి, D/o. late శ్రీనివాసు, వయస్సు 22 సం||లు, Flat No. 302, భాస్కర్ అపార్ట్‌మెంట్స్, ఏలూరు, EJCJC. ...(D9)
R-10: సొంటి ప్రమీలాకుమారి, W/o. వెంకటేశ్వర్లు, వయస్సు 63 సం||లు, డో.నెం. 23-3-35/2, విద్యానగర్, ఏలూరు EJCJC. ...(D10)

పై నెంబరు దావాలో చనిపోయిన 4వ ప్రతివాది యొక్క వారసులుగా మిమ్ములను చేర్పించమని పిటిషనరు L.R పిటీషన్ను దాఖలు చేయగా సదరు పిటిషనులో కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు పై పిటిషన్ను కోర్టు వారు **ది. 12-5-2023 సం|| తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 గం||లకు** మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

పి.జె.పి.కెనడి, పిటిషనరు అడ్వకేట్
భీమవరం బేతనీపేట, భీమవరం-1
ది.8-5-23 సెల్: 9347304911

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 542/2019, I.A. 157/2023 in O.S. No. 24/2014

Between:
బుర్రా పూర్ణిమ **-పిటీషనరు**
Vs
రాట్నాల శ్రీనివాసరావు వగైరా **-రెస్పాండెంట్లు**
To:
R-9: మెరగాని హితైషి, D/o. late శ్రీనివాసు, వయస్సు 22 సం||లు, Flat No. 302, భాస్కర్ అపార్ట్‌మెంట్స్, ఏలూరు, EJCJC. ...(D9)
R-10: సొంటి ప్రమీలాకుమారి, W/o. వెంకటేశ్వర్లు, వయస్సు 63 సం||లు, డో.నెం. 23-3-35/2, విద్యానగర్, ఏలూరు EJCJC. ...(D10)

పై నెంబరు దావాలో చనిపోయిన 4వ ప్రతివాది యొక్క వారసులుగా మిమ్మును చేర్పించమని దాఖలు చేయవలసిన L.R పిటీషన్ను దాఖలు చేయుటలో అయిన Delay ను condone చేయించమని పై పిటిషన్ను దాఖలు చేయగా సదరు పిటిషనులో కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు పై పిటిషన్ను కోర్టు వారు **ది. 12-5-2023 సం|| తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం 10.30 ని||లకు** కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

పి.జె.పి.కెనడి, పిటిషనరు అడ్వకేట్
భీమవరం బేతనీపేట, భీమవరం-1
ది.8-5-23 సెల్: 9347304911

CHANGE OF NAME

I, PEDAPATI VIJAYA SANTHI, W/O PEDAPATI NARENDRA, D.NO. 4-162/1, PEDAPETA, JINNURU POST, PODURU MANDAL, W.G.DT., A.P. I HAVE CHANGED MY NAME FROM PEDAPATI SANTHI(OLD NAME) TO PEDAPATI VIJAYA SANTHI (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME PEDAPATI VIJAYA SANTHI

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 542/2019, I.A. 158/2023 in O.S. No. 24/2014

Between:
బుర్రా పూర్ణిమ **-పిటీషనరు**
Vs
రాట్నాల శ్రీనివాసరావు వగైరా **-రెస్పాండెంట్లు**
To:
R-9: మెరగాని హితైషి, D/o. late శ్రీనివాసు, వయస్సు 22 సం||లు, Flat No. 302, భాస్కర్ అపార్ట్‌మెంట్స్, ఏలూరు, EJCJC. ...(D9)
R-10: సొంటి ప్రమీలాకుమారి, W/o. వెంకటేశ్వర్లు, వయస్సు 63 సం||లు, డో.నెం. 23-3-35/2, విద్యానగర్, ఏలూరు EJCJC. ...(D10)

పై నెంబరు దావాలో చనిపోయిన 4వ ప్రతివాది యొక్క వారసులుగా మిమ్మును చేర్పించమని దాఖలు చేయవలసిన L.R పిటీషనులో జరిగిన abatment ను రద్దు చేయించమని పిటిషనరు పై నెంబరు పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషనులో కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు పిటిషనులో మీయొక్క హాజరు నిమిత్తం కోర్టు వారు **ది. 12-5-2023 సం|| తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం 10.30 గం||లకు** కోర్టుకు హాజర్రై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

పి.జె.పి.కెనడి, పిటిషనరు అడ్వకేట్
భీమవరం బేతనీపేట, భీమవరం-1
ది.8-5-23 సెల్: 9347304911

ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 93/2017, I.A. 689/2008
O.S. 24/1988

Between:
శ్రీ ముదునూరి హనుమంతరాజు ***...DHR***
Vs
1. శ్రీ ముదునూరి భీమరాజు (died)
2. శ్రీ ముదునూరి వెంకట శ్రీనివాసరాజు వగైరాలు ***...JDRs***

To:
4వ JDR: శ్రీమతి గోకరాజు బాలత్రిపుర సుందరి, W/o. గణపతిరాజు, హిందు, స్త్రీ, 45 సం||లు, House Wife, జువ్వలపాలెం, భీమవరం మండలం, భీమవరం JCJC.

పై నెంబరు డిక్రీ మొత్తం వసూలు నిమిత్తం DHR E.P Schedule ఆస్తిని వేలము వేయించి బాకీ రాబట్టుకొనుటకు గాను పై నెంబరు E.P దాఖలు చేయుట జరిగినది. సదరు E.P నందు 4వ JDR అయిన మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించుచున్ననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసుకొనకుండా నిలువరించుచున్నందున, శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసు అమలు చేయమని ఆర్డరు వేసినందున, యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియచేయడమైనది. కావున **ది. 12-05-2023వ తేదీ ఉదయం 10.30 ని||లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 12-05-2023
కొవ్వూరు **మద్దిపాటి శ్రీనివాస్**
08-5-2023 అడ్వకేట్, కొవ్వూరు

బహిరంగ ప్రకటన

నా క్లయింటు, చింతలపూడి మండలం, రేచర్ల గ్రామ కాపురస్తురాలు కంచర్ల నాగబాబు భార్య శ్రీమతి కంచర్ల కవిత, తన మైనర్ కుమారుడు కుమార్తెల యొక్క గార్డియన్ హోదాలో నాకు యిచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా,

ఈ నోటీసు దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖల ఆస్తులు నా క్లయింటు యొక్క మైనర్ కుమారుడు, మైనర్ కుమార్తెలు అనగా కంచర్ల కార్తికేయ మరియు లాస్యశ్రీ లకు పూర్వార్జితపు ఆస్తులై వున్నవి. కాని వీరి తండ్రి, తాత మరియు మేనత్తలు నా క్లయింటు యొక్క పరోక్షంలో సదరు ఆస్తులను అమ్మివేయుటకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా నా క్లయింట్ యొక్క మైనర్ పిల్లల ఆస్తులకు నష్ట కల్గించదలచుకున్నారు. నా క్లయింటు ఇప్పటికే తన భర్త కంచర్ల నాగబాబుకి, మామగారు కంచర్ల నాగేశ్వరరావు గార్కి ఆడబడుచులు - శ్రీమతి అలగాని సరోజిని మరియు శ్రీమతి గుండ్ల వరలక్ష్మి గార్లకు ప్లీడరు నోటీసు ఇప్పించియున్నారు. అందు తన మైనర్ పిల్లల యొక్క షేర్లను పంచి యివ్వవలసిందిగా కోరినారు. కాని అందుకు విరుద్ధంగా పై వారలు సదరు ఆస్తులను అమ్ముటకు ప్రయత్నిస్తున్నారు. కావున ఈ ప్రకటన కృతంగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా ఈ నోటీసు దిగువ ఉదహరించిన ఆస్తుల యందు నా క్లయింట్ యొక్క మైనర్ పిల్లలకు హక్కులు కలవని, వాటిపై ఎవ్వరు ఎట్టి లావాదేవీలు చేయరాదని, అట్లు చేసిన యెడల అవి నా క్లయింట్ యొక్క పిల్లల హక్కులను ఏవిధంగాను అవిభద్ధించవని, అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని యిందుమూలంగా తెలియచేయడమైనది.

నోటీసు షెడ్యూలు ఆస్తుల వివరం:
1. చింతలపూడి మండలంలోని రేచర్ల రెవెన్యూ గ్రామంలోని R.S. No. 31/7 దాఖల య. 2-80 వ్యవసాయ భూమి.
2. చింతలపూడి మండలం, రేచర్ల రెవెన్యూ గ్రామంలోని R.S. No. 119 దాఖల డో.నెం. 1/29 ఇంటి ఆస్తి.
3. చింతలపూడి మండలం, రేచర్ల రెవెన్యూ గ్రామంలోని R.S. No. 16/1N దాఖల య. 0.99 సెంట్ల వ్యవసాయ భూమి.

N.V.SATYANARAYANA
Eluru Advocate, Eluru
08-5-2023 Cell: 9440376655